# సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయండి

## కలెక్టర్ ప్రియాంక ఆల


అధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాచలం, మార్చి 9 : పట్టణంలో ఈ నెల 11న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ ప్రియాంక ఆల.. ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్‌తో కలిసి శనివారం పరిశీలించారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపట్టనున్న కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు దగ్గరుండి పనులను పర్యవేక్షించి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట రామాలయ ఈవో ఎల్.రమాదేవి, ఏఎస్పీ పరితోశ్ పంకజ్, ఆర్డీవో దామోదరరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


కొత్తగూడెం టౌన్ : కల్యాణ క్రతువు జరిపిస్తున్న అర్చకుడు

# హౌజ్‌ఫుల్ దిశగా కోల్డ్‌స్టోరేజీలు

- గతేడాది రికార్డ్ స్థాయిలో మిర్చి ధరలు
- క్వింటా ఒక్కంటికి రూ.25 వేలు పలికిన ధర
- ప్రస్తుత ధర రూ.21,100 మాత్రమే..
- మున్ముందు ధరలు పెరుగుతాయని ఖరీదుదారులు, రైతుల అంచనా
- ఇప్పటికే 75 శాతానికి పైగా నిండిన శీతల గిడ్డంగులు



ఖమ్మం వ్యవసాయం, మార్చి 9 : ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాల్లో సగానికి పైగా బస్తాలు కోల్డ్‌స్టోరేజీలకే తరలుతున్నాయి. ఏటా సీజన్ పూర్తయినా కోల్డ్‌స్టోరేజీల నిల్వసామర్థ్యంలో కనీసం సగం కూడా నిండేది కాదు. కానీ.. ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తున్నది. చైనాకు చెందిన ప్రముఖ కంపెనీలు మిర్చి కొనుగోళ్లను మందకొడిగా చేపడుతుండడం, ఆశించిన మేర ఎగుమతులు లేకపోవడంతో ఖరీదుదారులు తాము కొన్న మిర్చిలో సింహభాగాన్ని నేరుగా కోల్డ్‌స్టోరేజీలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం మార్కెట్ సమీపంలోని కోల్డ్‌స్టోరేజీలు మిర్చి బస్తాలతో పూర్తిస్థాయిలో నిండిపోయాయి. స్టోరేజీ యజమానులు మిర్చి బస్తాలు నిల్వ చేసేందుకు చోటు లేదని బోర్డులు సైతం పెట్టారు.

### పెరిగిన సాగు విస్తీర్ణం.. కానీ.. మిర్చి ధర మాత్రం తక్కువే..


గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు వానకాలంలో మిర్చి సాగు చేశారు. ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో వచ్చే సీజన్‌లో మిర్చి సాగు విస్తీర్ణం మరింత పరిస్థితి గోచరిస్తున్నది. మరోవైపు రానున్న రోజుల్లో మిర్చి ధరలు మరింత పెరుగుతాయని ఖరీదుదారులు అంచనా వేస్తున్నారు. దీంతో కొన్న మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో భద్రంగా దాచిపెడుతున్నారు. జిల్లాలోని కోల్డ్‌స్టోరేజీలు 75 శాతానికి పైగా మిర్చి బస్తాలతో నిండడమే అందుకు నిదర్శనం. గతేడాది రికార్డు స్థాయిలో మిర్చి ధరలు పలకడంతో కోల్డ్‌స్టోరేజీలన్నీ ఖాళీ అయ్యాయి. నాడు ఒక క్వింటాల్‌కు మిర్చి ధర రూ.25 వేలకు పైగా పలికింది. ఈ ఏడాది కూడా అదే ఒరవడి ఉంటుందని రైతులు, ఖరీదుదారులు భావించారు. కానీ.. ఈసారి గరిష్ఠ ధర క్వింటాల్‌కు రూ.21,100 మించి లేదు. నాణ్యమైన పంట రావడం లేదనే ఉద్దేశంతో వ్యాపారులు కేవలం ఒకటి రెండు లాట్లకు మాత్రమే జెండా పాట పెట్టి ధర నిర్ణయిస్తుండడంతో అది నచ్చని రైతులు తమ పంటను కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు.

### కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వలు ఇలా..

జిల్లాలో ఖమ్మం ఏఎంసీతో పాటు మధిర, నేలకొండపల్లి, మద్దులపల్లి, వైరా, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరులో ఏఎంసీలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కేవలం ఐదు మార్కెట్ల పరిధిలో మాత్రమే కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. సత్తుపల్లి, కల్లూరు, ఏన్కూరు మార్కెట్ల పరిధిలో కోల్డ్‌స్టోరేజీలు లేవు. ఖమ్మం ఏఎంసీ పరిధిలోని 14 కోల్డ్‌స్టోరేజీల నిల్వ సామర్థ్యం 11.28 లక్షల బస్తాలు కాగా ప్రస్తుతం 5.13 లక్షల బస్తాలతో నిండిపోయాయి. నేలకొండపల్లి ఏఎంసీ పరిధిలోని రెండు కోల్డ్ స్టోరేజీల నిల్వసామర్థ్యం 2.20 లక్షల బస్తాలు కాగా.. ప్రస్తుతం వాటిలో 65 వేల బస్తాలు ఉన్నాయి. వైరా ఏఎంసీ పరిధిలోని ఆరు కోల్డ్ స్టోరేజీల నిల్వసామర్థ్యం 8.30 లక్షల బస్తాలు కాగా ప్రస్తుతం వాటిలో 2.30 లక్షల బస్తాలు ఉన్నాయి. మద్దులపల్లి ఏఎంసీ పరిధిలో ఆరు కోల్డ్‌స్టోరేజీల నిల్వ సామర్థ్యం 9.75 లక్షల బస్తాలు కాగా.. వాటిలో ప్రస్తుతం 4.31లక్షల బస్తాలు నిల్వ ఉన్నాయి. మధిర ఏఎంసీ పరిధిలోని 12 కోల్డ్ స్టోరేజీల నిల్వసామర్థ్యం 12.40 లక్షల బస్తాలు కాగా.. ప్రస్తుతం వాటిలో 7.12 లక్షల బస్తాలు నిల్వ ఉన్నాయి. ఇలా ఐదు ఏఎంసీల పరిధిలోని 43 కోల్డ్‌స్టోరేజీల నిల్వసామర్థ్యం 43.93 లక్షల బస్తాలు కాగా.. ప్రస్తుతం వాటిలో 19.52 లక్షల బస్తాలు నిల్వ ఉన్నాయి. ఈ చొప్పున మరో 24.40 లక్షల బస్తాలను మాత్రమే కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వచేసేందుకు అవకాశం ఉంది.

### పంట నిల్వల వివరాలు..

| | |
|---|---|
| జిల్లాలో కోల్డ్ స్టోరేజీల సంఖ్య | 43 |
| నిల్వసామర్థ్యం | 43.93 లక్షల బస్తాలు |
| ప్రస్తుత నిల్వలు | 19.52 లక్షల బస్తాలు |



### ఒక్కో కోల్డ్ స్టోరేజీలో ఒక్కో ధర..

కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యాలు రైతులు, వ్యాపారుల నుంచి ఇష్టారీతిన కిరాయిలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. నగరంలోని కోల్డ్‌స్టోరేజీల యాజమాన్యాలు నెలకు ఒక బస్తాకు రూ.210 నుంచి రూ.220 వసూలు చేస్తుండగా, నగర శివారులోని కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యాలు రూ.150–రూ.160 వరకు వసూలు చేస్తున్నాయి. ఖమ్మం ఏఎంసీలో మిర్చి ఖరీదు చేసే వ్యాపారుల్లో మెజార్టీ మందికి సొంత కోల్డ్‌స్టోరేజీలు ఉన్నాయి. వీరు మిగిలిన వ్యాపారులు, రైతుల నుంచి అధిక మొత్తంలో కిరాయిలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి. ఇందులోనూ రైతులకు ఒక ధర, వ్యాపారులకు ఒక ధర ఉన్నట్లు సమాచారం. యాంత్రాంగం పట్టించుకోకపోవడంతోనే కోల్డ్‌స్టోరేజీల యాజమాన్యాలు నియంత్రణ పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం నగర పరిధిలోని కోల్డ్‌స్టోరేజీలన్నీ దాదాపు నిండేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో రైతులు పంటను దాచుకునేందుకు నగర శివారులోని కోల్డ్‌స్టోరేజీలకు వెళ్తున్నారు.

# వైభవంగా శివ కల్యాణం

- శాస్త్రోక్తంగా క్రతువు నిర్వహించిన వేద పండితులు
- శివనామ స్మరణతో వేడుకలను తిలకించిన భక్తజనం
- కూసుమంచిలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహా శివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవాలయాల్లో శివపార్వతుల కల్యాణం శుక్రవారం అర్ధరాత్రి కన్నుల పండువగా జరిగింది. సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా.. వేద పండితుల మంతోచ్ఛారణల మధ్య నిర్వహించిన స్వామివారి కల్యాణాన్ని వేలాది మంది భక్తులు తిలకించి తన్మయత్వం పొందారు. జాగారంతో నిత్యం శివనామ స్మరణ చేస్తూ కల్యాణ తంతును కనులారా వీక్షించారు. కూసుమంచి శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జూలూరుపాడు మండలం పాపకొల్లు ఉమాసోమలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపించారు. రూరల్ మండలం తీర్థాల శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని కన్నుల పండువగా చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఎంజీరోడ్‌లో ఉన్న విజయవిఘ్నేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని దుర్గామల్లేశ్వరస్వామి దేవాలయంలో కల్యాణ క్రతువు వైభవోపేతంగా జరిగింది. అన్నపురెడ్డిపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో త్రిశూల స్నానం కార్యక్రమాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర–విజయలక్ష్మి దంపతులు ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరంలోని రామలింగేశ్వరస్వామి, సత్తుపల్లిలోని నీలాద్రీశ్వరుడిని, ఖమ్మం కాల్వొడ్డులోని గుంటుమల్లేశ్వరస్వామి, రూరల్ మండలం తీర్థాల, కూసుమంచి శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కూసుమంచి శివాలయంలో హైదరాబాద్, ఖమ్మం కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. టేకులపల్లి మండలం కొండంగబోడు కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని కూసుమంచి, తీర్థాల శివాలయాలను దర్శించుకొని శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

*–నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మార్చి 9*


ఖమ్మం : కూసుమంచి శివాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర


టేకులపల్లి : కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, లక్ష్మి దంపతులు


అశ్వారావుపేట టౌన్ : శివకల్యాణం జరిపిస్తున్న పండితులు


సత్తుపల్లిరూరల్ : బుగ్గపాడులో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కొత్తగూడెం టౌన్ : కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


జూలూరుపాడు : కల్యాణ క్రతువు జరిపిస్తున్న ఆలయ అర్చకులు


కారేపల్లి : శివలింగాలను దర్శించుకుంటున్న భక్తులు


కూసుమంచి : కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణం

# ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

## లింగగూడెంలో రోడ్డెక్కి నిరసన
## అధికారుల హామీతో ఆందోళన విరమణ


ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పెనుబల్లి, మార్చి 9 : మూడు రోజులుగా నల్లా నీరు రాకపోవడంతో విసుగు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో లింగగూడెం ప్రధాన రహదారిపై శనివారం ధర్నాకు దిగారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా లింగగూడెం గ్రామానికి చెందిన పలువురు మహిళలు మాట్లాడుతూ తాగునీరు రాకపోవడంతో మూడు రోజులుగా ఇబ్బందులకు గురవుతున్నామని, దీనిపై పంచాయతీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కనీసం ట్యాంకర్లతో కూడా నీటిని సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. దీంతో మండలస్థాయి అధికారులు ఆందోళన వద్దకు చేరుకొని మహిళలతో మాట్లాడారు. బోరు బావుల సమస్య ఉన్న మాట వాస్తవమేనన్నారు. ఎస్టీ కాలనీకి ప్రత్యేక బోరు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో మహిళలు ఆందోళన విరమించారు.

# తెగిన అలుగు.. ఆగిన సాగు!

- కొట్టుకుపోయిన వెంగళరావు ప్రాజెక్టు అలుగు
- యాసంగిలో పంటలు సాగు చేయని ఆయకట్టు రైతులు
- బాగు చేయిస్తామని చెప్పి విస్మరించిన కాంగ్రెస్ నేతలు
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు


తెగిన వెంగళరావు ప్రాజెక్టు అలుగు



చంద్రుగొండ, మార్చి 9 : ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన సీతాయిగూడెం గ్రామంలోని వెంగళరావు ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. మండలంలోని 2,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రాజెక్టు అలుగు తెగిపోయినా పట్టించుకునేవారు కరువయ్యారు. ఎన్నికల హామీలో భాగంగా దీనిని బాగు చేయిస్తామనే నినాదాన్ని ఎత్తుకున్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు నెలలు కావొస్తున్నా కనీసం ప్రాజెక్టు వైపు చూడలేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. 2,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రాజెక్టు అలుగు తెగిపోవడంతో చుక్కనీరు నిలిచే పరిస్థితి లేదు. దీంతో రైతులు ఈ ఏడాది యాసంగి సాగు చేయలేదు. కనీసం ఖరీఫ్(వానకాలం) సీజన్ వరకు నీరు వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదని ఆయకట్టు రైతులు దిగులు చెందుతున్నారు. ప్రాజెక్టు అలుగు నిర్మాణంపై ప్రజాప్రతినిధులు, అధికారులు నోరు మెదపకపోవడంపై ఆయకట్టు రైతులు ఆందోన చెందుతున్నారు. మరో మూడు నెలలు గడిస్తే మళ్లీ వానకాలం వస్తుంది. దీంతో నిర్మాణ పనులు చేపట్టడం కష్టతరమవుతుంది. ప్రాజెక్టు ఆయకట్టు కింద చంద్రుగొండ, దామరచర్ల, సీతాయిగూడెం, అయ్యన్నపాలెం, ఇమ్మడి రామయ్యబంజర, తిప్పనపల్లి, మహ్మద్‌నగర్ గ్రామాల రైతుల భూములు ఉన్నాయి. అధికారికంగా 2,500 ఎకరాలు సాగు కాగా.. అనధికారికంగా మరో 300 ఎకరాల వరకు ఈ ప్రాజెక్టు కింద రైతులు పంటలు పండించుకుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అలుగు నిర్మాణం చేపట్టాలని ఆయకట్టు రైతులు, ప్రజలు కోరుతున్నారు.

### వెంటనే అలుగును నిర్మించాలి



ఈ ఏడాది యాసంగి సాగు సగానికి పైగా తగ్గింది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. మళ్లీ వానకాలం వస్తే పనులు చేయడం కష్టమవుతుంది. ఖరీఫ్‌కు నీరు లేకపోతే 2,500 ఎకరాలు బీడు భూములుగా మారుతాయి. అధికారులు ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించాలి. సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి.

**– జడ వెంకయ్య, రైతు, ఆయకట్టు మాజీ చైర్మన్, దామరచర్ల, చంద్రుగొండ మండలం**

# మద్యం వ్యాపారుల నిరసన

## వ్యాట్‌టాక్స్ నిలిపివేయాలని డిపో ఎదుట ఆందోళన


వినతిపత్రం అందజేస్తున్న మద్యం వ్యాపారులు

వైరాటౌన్, మార్చి 9 : మద్యం అమ్మకాలపై అదనంగా వసూలు చేస్తున్న వ్యాట్‌టాక్స్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా వైరా ఐఎంఎల్ డిపో ఎదుట మద్యం షాపుల నిర్వాహకులు శనివారం నిరసనకు దిగారు. వ్యాపారులు మద్యం కొనుగోళ్లను నిలిపివేయడంతో డిపో వెలవెలబోయింది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వైన్స్ అండ్ బార్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ గుర్రాల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మద్యం వ్యాపారులు అమ్మకాలపై జీఎస్టీ, ఇతర టాక్స్‌లు కట్టలేక ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారని, దీనికి అదనంగా వ్యాట్‌టాక్స్ పేరుతో మరో ఏడు శాతం పెంచడం వల్ల వ్యాపారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాత విధానాన్ని అమలు చేయడంతోపాటు వ్యాట్‌టాక్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు మద్యం కొనుగోళ్లను నిలిపివేస్తామని హెచ్చరించారు. అనంతరం ఐఎంఎల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైన్స్ అండ్ బార్ అసోసియేషన్ జిల్లా నాయకులు గొర్రెపాటి నరేశ్, సుబ్బారావు, వైన్ షాపు నిర్వాహకులు పాల్గొన్నారు.

# పల్టీ కొట్టిన ప్రైవేటు బస్సు

## లారీని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి బోల్తా
## 13 మందికి స్వల్ప, ఇద్దరికి తీవ్రగాయాలు


బస్సు బోల్తాపడడంతో గాయపడిన ప్రయాణికులు

కూసుమంచి, మార్చి 9 : లారీని ఓవర్‌టేక్ చేయబోయిన ప్రైవేట్ బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ఘటన కూసుమంచి మండలంలోని సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. 31 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి కాకినాడకు వెళ్తున్న ప్రైవేటు బస్సు కూసుమంచి సమీపంలోని లోక్యాతండా వద్ద జాతీయ రహదారిపై ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. అదుపుతప్పి పక్కనే సర్వీస్ రోడ్డుపై బస్సు పడిపోయింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 13 మందికి స్వల్ప గాయాలు కాగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలో బస్సులోని మిగతా ప్రయాణికులు ఒక్కసారిగా తేరుకొని జాగ్రత్తపడ్డారు. హైవే పెట్రోలింగ్, అంబులెన్స్ సిబ్బంది తక్షణమే స్పందించి వారికి ప్రథమ చికిత్స చేసి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. తర్వాత వారు తమ స్వస్థలాలకు వెళ్లిపోయారు. కూసుమంచి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతానికి కొద్ది దూరంలోనే బ్రిడ్జి ఉంది. అక్కడ ప్రమాదం జరిగినట్లైతే ప్రాణనష్టం వాటిల్లేదని స్థానికులు చెబుతున్నారు.